



ఫైనాన్స్ సిబ్బంది రాసిచ్చిన వాయిదాల బుక్ చీటి


మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

రెవెన్యూ డివిజన్‌పై గళ మెత్తిన ఎమ్మెల్యే అనిల్

బోథ్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): గత దశాబ్దం కాలంగా నియోజకవర్గకేంద్రాన్ని డివిజన్‌గా ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తూ వస్తున్నారు. అయితే గతంలో జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో రాజకీయ పార్టీల వారు మండల కేంద్రాన్ని రెవెన్యూ డివిజన్‌గా మారుస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం ఎన్నికల ప్రచార సభలో నియోజకవర్గ కేంద్రాన్ని రెవెన్యూ డివిజన్‌గా మారుస్తామని హామీ ఇచ్చారు. అయితే బోథ్ ప్రజల ఆకాంక్షను మంగళవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ వివరిస్తూ గళం ఎత్తారు. అయితే ఎమ్మెల్యే అసెంబ్లీలో సమస్యను ప్రస్తావించడంతో మండల ప్రజల్లో ఆశలు రెకెత్తిస్తున్నాయి. ఏదేమైనా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు ప్రక్రియ ఎప్పుడు ప్రారంభమవుతుందని నియోజకవర్గ ప్రజలు ఆసక్తిగా చూస్తున్నారు.


బాధ్యతల స్వీకరణ తర్వాత ఎస్పీని కలిసిన సీఐ

బోథ్ సీఐగా వెంకటేశ్వరరావు

బోథ్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): బోథ్ సీఐగా ఎ. వెంకటేశ్వరరావు మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. అనంతరం ఎస్పీ గౌస్‌ఆలంను కలిసి బోథ్ ప్రాంత సమస్యలపైన ఎస్పీకి వివరించారు. గంజాయిని పూర్తి స్థాయిలో రూపుమాపాలని, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని, అలాగే గ్రామాల్లోని సమస్యలపై పరిశీలించాలని ఎస్పీ సూచించారని సీఐ తెలిపారు.


నేరడిగొండలో ఓ కుటుంబంతో ఘర్షణ పడుతున్న ఫైనాన్స్ సిబ్బంది(ఫైల్)

- జిల్లాలోని పల్లెల్లో మితిమీరిపోతున్న మైక్రో ఫైనాన్స్ సిబ్బంది ఆగడాలు
- ఏజెన్సీ ప్రాంతాలను టార్గెట్ చేస్తూ జోరుగా దందా
- డెయిలీ, వీక్లీ, మంత్లీ అంటూ అడ్డగోలు వ్యాపారం
- అధిక వడ్డీలతో అమాయక ప్రజల నడ్డి విరుస్తున్న వైనం
- తేలికగానే తీసుకుంటున్న జిల్లా అధికార యంత్రాంగం

మైక్రో.. మాఫియా

జిల్లాలో.. మైక్రో ఫైనాన్స్ మాఫియా ఆగడాలు రోజురోజుకూ మితిమీరి పోతున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి. నిరుపేదల అవసరాలను ఆసరాగా తీసుకుంటూ అడ్డగోలు దోపిడీ దందాకు ఎగబడుతున్నారు. అడిగిన వెంటనే రుణాలు ఇస్తు ఆపై బలవంతపు వసూళ్లకు దిగుతున్నారు. ముఖ్యంగా మారుమూల గిరిజన గ్రామాలనే టార్గెట్ చేస్తూ వడ్డీ వ్యాపారాన్ని సాగిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన వివిధ రకాల మైక్రోఫైనాన్స్ కంపెనీల ప్రతినిధులు అప్పులు ఇస్తూ వడ్డీలపై వడ్డీలు వేస్తూ అందినకాడికి దండుకుంటున్నారు.

ఆదిలాబాద్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మారుమూల మండలాలైనా సిరికొండ, ఇంద్రవెల్లి, ఉట్నూర్, నార్నూర్, నేరడిగొండ, ఇచ్చోడ, బజార్‌హత్నూర్, భీంపూర్, బేల, తదితర మండలాల్లో విచ్చలవిడిగా వడ్డీ వ్యాపారం దందా కొనసాగుతోంది. అయినా అధికారులు అక్రమ దందాలకు అడ్డుకట్ట వేసే ప్రయత్నం చేయడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. వడ్డీ వ్యాపారుల ఉచ్చులో చిక్కుకుని ఎన్నో నిరుపేద కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతున్నాయి. కొన్ని సందర్భాల్లో వాయిదాలు చెల్లించలేని వారిపై దాడులకు సైతం వెనుకాడడం లేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో తెలుస్తునే ఉంది. ఎలాంటి అనుమతులు లేకుండానే కోట్ల రూపాయల లావాదేవీలు జరుగుతున్న జిల్లా అధికార యంత్రాంగం చోద్యం చూస్తోందన్న ఆరోపణలు వస్తున్నాయి. జిల్లాకేంద్రంతో పాటు మండల కేంద్రాలాల్లో చిన్న రూములను అద్దెకు తీసుకుంటూ జిల్లావ్యాప్తంగా తమ దందాను విస్తరింప చేసుకుంటున్నారు.

అడ్డగోలుగా దోపిడీ

అమాయక నిరుపేదల అవసరాలను ఆసరాగా చేసుకుంటున్న ఫైనాన్స్ సిబ్బంది వాయిదాల పద్ధతిలో అప్పులు చెల్లించాలంటూ అధిక వడ్డీలను వసూళ్లు చేస్తున్నారు. ఎక్కువగా దినసరి కూలీలు, నిరక్షరాస్యులే కావడంతో సిబ్బంది చెప్పిందే లెక్కాగా మారింది. రుణాలు ఇచ్చే సమయంలో ఇన్సూరెన్స్, డాక్యుమెంట్ చార్జీల పేరిట అదనపు వసూళ్లకు ఎగబడుతున్నారు. పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా వడ్డీ వ్యాపారం కొనసాగిస్తున్నారు. నూటికి 5 నుంచి 15 శాతం వరకు వడ్డీతో అప్పులు ఇస్తూ బలవంతపు వసూళ్లకు ఎగబడుతున్నారు. అత్యవసర సమయంలోనైతే 20 శాతం వరకు వడ్డీకి అప్పులు ఇస్తునట్లు తెలుస్తుంది. గ్రామాల్లో కొంత మంది మహిళలను గ్రూపులుగా ఏర్పాటు చేసి రుణాలను మంజూరు చేస్తున్నారు. ఒక్కో గ్రూపునకు రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు అదనంగా దండుకుంటున్నారు. ఏజెంట్లు చెప్పే మాయమాటలకు అమాయక ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు. ఏదైనా ఒక నెల వాయిదా చెల్లించక పోతే వడ్డీపై వడ్డీలు వేస్తూ అధికంగా వసూలు చేస్తున్నారు. ఇంట్లో ఎవరైనా అనారోగ్య భారీనపడి చనిపోయిన, ఇంటి ముందు శవం ఉన్న వడ్డీ మాత్రం చెల్లించాల్సిందేనంటూ బెదిరింపులకు దిగుతున్నారు. కొన్ని సందర్భాల్లో వాయిదాలు చెల్లించలేని పరిస్థితుల్లో ఒత్తిళ్లు పెరిగి పోతున్నాయి. అసలే గ్రామాల్లో నీతి నిజాయితీ, పరువు ప్రతిష్టలకు పోతున్న అమాయక ప్రజలు ఆర్థిక ఇబ్బందులతోనే ఉసురు తీసుకుంటున్న పరిస్థితులు ఎదురవుతున్నాయి.

కట్టడి చర్యలు కరువు

మారుమూల గ్రామాల్లో విచ్చలవిడిగా సాగుతున్న మైక్రోఫైనాన్స్‌లపై నిఘా కరువవుతుందన్న ఫిర్యాదులు వస్తున్నాయి. గ్రామాల్లో తరచుగా ఫైనాన్స్ సిబ్బందికి అమాయక ప్రజల మధ్య ఘర్షణలు జరుగుతున్న బయటకు రాకుండా జాగ్రత్త పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నా.. అప్పు తీర్చాలంటూ ఉచిత సలహాలను

(తరువాయి 6వ పేజీలో...)


వాయిదాలు చెల్లించాలంటూ ఓ ఇంటి ముందు కాపలా కాస్తున్న ఫైనాన్స్ సిబ్బంది

కలప అక్రమ వ్యాపారం నేరం

- ఆదిలాబాద్ టాస్క్‌ఫోర్స్ రేంజ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి
- సిరికొండ మండలం బోరింగ్‌గూడలో కలప దుంగలు స్వాధీనం

6



రోజురోజుకూ పెరుగుతున్న చలి

- చలితో వణికిపోతున్న జనం
- విద్యార్థులు, వృద్ధుల ఇక్కట్లు
- బేల మండలంలో 5.8 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదు

7



శిథిలావస్థలో సీడీపీవో భవనం

- కార్యాలయాన్ని ఐటీడీఏ సముదాయంలోకి మార్చిన పీవో
- అప్పటి నుంచి ఖాళీగా ఉన్న వైనం
- సిబ్బందికి తప్పని దూర భారం

7




విద్యార్థులకు అల్పాహారాన్ని అందజేస్తున్న డీఐఈవో రవీందర్, కళాశాల అధ్యాపకులు

అల్పాహారం.. గొప్ప నిర్ణయం

- డీఐఈవో రవీందర్ కుమార్

ఇచ్చోడ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే విదార్థులు కళాశాలకు రెగ్యూలర్‌గా రావాలనే ఉద్దేశ్యంతో అధ్యాపకులంతా కలిసి కళాశాలలో విద్యార్థులకు అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు. కళాశాల ఇచ్చోడకు దూరంగా ఉండడంతో విద్యార్థులు మధ్యాహ్న భోజనానికి ఇబ్బందులు పడుతుండడం గమనించిన అధ్యాపకులు తమ వంతుగా కళాశాలలోనే అల్పాహార కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఐఈవో రవీందర్ కుమార్ హాజరై ప్రసంగించారు. వార్షిక పరీక్షల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఉత్తమ ఫలితాల సాధన దిశగా ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. సబ్జెక్టు పూర్తయిన అధ్యాపకులు పునశ్చరణ తరగతులు చేపట్టాలని ఆదేశించారు. వార్షిక పరీక్షల్లో ఇచ్చోడ ప్రభుత్వ కళాశాల విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికాబద్ధమైన రీతిలో సన్నద్ధం చేయాలని స్పష్టం చేశారు. ఇందులో కళాశాల ప్రిన్సిపాల్ శంకర్, అధ్యాపకులు సత్యనారాయణ, ప్రభాకర్‌రెడ్డి, సోమన్న, గోవర్ధన్, రాజేశ్వర్, బాలాజీ, నాగభూషన్, బాస్కర్, మాదవి, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యపు అలవాట్లను అలవర్చుకోవాలి

- సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండి ఏ రోజు పని.. ఆ రోజే పూర్తి చేయాలి
- ధన్నోరా(బి) ప్రభుత్వ పాఠశాలలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా


నర్సరీని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా


ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో మాట్లాడుతూ..

ఇంద్రవెల్లి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థిని, విద్యార్థులు చిన్న వయస్సు నుంచే ఆరోగ్య అలవాట్లను అలవర్చుకుని ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వ పాఠశాలల్లో ఆరోగ్య పాటశాల కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం మండలంలోని ధన్నోరా(బి) జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన ఆరోగ్య పాఠశాల కార్యక్రమానికి హాజరయ్యారు. ముందుగా రోజువారీగా పాటించే ఆరోగ్య సూత్రాలు, కాలానుగుణంగా వచ్చే వ్యాధులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రతీరోజు తీసుకునే పౌష్టికాహారంపై ఎంపిక చేసిన విద్యార్థినీ, విద్యార్థులు చదివి వినిపించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. చిన్న వయస్సు నుంచే విద్యార్థులు ఆరోగ్య సూత్రాలు పాటించి ఆరోగ్యంగా ఉండటంతో పాటు సెల్‌ఫోన్ వాడకం, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలలో ఆరోగ్య పాఠశాల కార్యక్రమం అమలు చేస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలో శ్రీకారం చుట్టిన ఆరోగ్య పాటశాల కార్యక్రమం నాలుగు వారాలుగా విజయవంతంగా కొనసాగిందని, ఇంకా నాలుగు వారాల పాటు పొడిగించి ఇది వరకే ఉన్న ఆరు సూత్రాలతో పాటు మరికొన్ని అంశాలను జోడించి జనవరి 12 వరకు కొనసాగించడం జరుగుతుందన్నారు. ఇందులో మొదటగా వ్యక్తిగత శుభ్రత, పోషకాహారం, ఒత్తిడి నివారణ, మాదక ద్రవ్యాలు, సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. వాటితో పాటు మరికొన్ని ఆరోగ్య సూత్రాలు జోడించడం జరిగిందన్నారు. జిల్లా పరిషత్ పాఠశాలలో కాంపౌండ్ వాల్ లేదని, స్టేజీ వద్ద షెడ్ లేదని, తరగతి గదులను మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని పాఠశాల నిర్వాహకులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, ట్రైని కలెక్టర్ అభిగ్యాన్ మలవీయ, జిల్లా విద్యాధికారి ప్రణీత, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో భాస్కర్, మండల విద్యాధికారి మానుకుమార్, ప్రధానోపాధ్యాయుడు ఎన్. అశోక్, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.


పశువులకు టీకాలు వేస్తున్న ట్రైనీ కలెక్టర్, పశుసంవర్ధక శాఖ వైద్యాధికారి

పాడి రైతులు వైద్య శిబిరాలను సద్వినియోగించుకోవాలి : ట్రైనీ కలెక్టర్

ఇచ్చోడ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పాడి రైతులు పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని, వీటి ద్వారా పాడి సంపదను మరింతగా పెంపొందించుకోవాలని జిల్లా శిక్షణ పాలనాధికారి (ట్రైనీ కలెక్టర్) అభిజ్ఞాన్ మాలవీయ అన్నారు. మంగళవారం మండలంలోని బోరిగామ గ్రామంలో తెలంగాణ పాడి పరిశ్రమ అభివృద్ధి సహకార సమాఖ్య, జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం గ్రామంలోని పశువులకు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో పశువులకు టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. పాడి రైతులు పశువులకు ఎప్పటికప్పుడు టీకాలు ఇప్పించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా.కిషన్, జిల్లా విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదన్‌రావు, మండల పశు వైద్యాధికారి డా.గోవింద్ నాయక్, పాడిరైతులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల ప్రణాళికతో వంద శాతం ఫలితాలు

- హెచ్‌ఎంల సమావేశంలో ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్త

ఉట్నూర్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్‌లోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పదవ తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించడానికి వంద రోజుల ప్రణాళికను ఖచ్చితంగా అమలు చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ డీడీలు, డీటీడీవోలు, ఏటీడీవోలు, ఏసీఎంవోలు, ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ఎస్ఎస్‌సీ విద్యార్థుల కోసం వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు కచ్చితంగా చేయాలన్నారు. అలాగే ఎస్ఎస్‌సీ వంద శాతం సిలబస్ పూర్తి అయ్యే విధంగా చూడాలని సూచించారు. విద్యార్థులకి అమలు అయినా కొత్త మెనూ ప్రకారం భోజనం పెట్టాలని తెలిపారు. గిరిజన సహకార సంస్థ ద్వారా సరఫరా చేయబడిన ఆహార పదార్థాల నాణ్యతను ప్రతీ


మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్త

రోజు పరిశీలించాలని ఐటీడీఏ పీవో ఈ సందర్భంగా పేర్కొన్నారు. అలాగే గిరిజన సహకార సంస్థ సిబ్బంది వారు వారంలో ఒక్కసారి ఆశ్రమ పాఠశాలలు సరుకులను పరిశీలించడం జరుగుతుందని అన్నారు. చల్లని వాతావరణం నుంచి విద్యార్థులను రక్షించడానికి తీసుకున్న స్వెట్టర్‌లని, అదేవిధంగా చేతులకి గ్లౌజ్‌లని ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థినులకు మధ్యాహ్నం భోజనంలో గిరిజన పోషణ మిత్ర ద్వారా ఇప్పపువ్వు లడ్డు, విటమిన్-సి టాబ్లెట్, ఐరన్ గల ట్యాబ్లెట్ మంగళవారం, శుక్రవారం కచ్చితంగా ఇవ్వాలని సంబంధిత వసతిగృహం వార్డెన్‌లను ఆదేశించారు. ఉపాధ్యాయుల పర్యవేక్షణ, టర్న్ విధులకు నిర్లక్ష్యం వహించరాదని అన్నారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలంటే పాఠశాలల పరిసరాలు పరిశుభ్రతను పాటించాలని సూచించారు. అనారోగ్యంతో ఉన్న బోర్డర్లపై ప్రత్యేకశ్రద్ధ వహించాలన్నారు.విద్యార్థి,సిబ్బంది రోజువారి హాజరు కోసం ఎఫ్ఆర్ఎస్ యాప్‌ని ఉపయోగించాలని తెలిపారు. వంద శాతం విద్యార్థుల హాజరు నిర్వహణపై ఆరా తీశారు. సోలార్ వాటర్ హీటర్, ఆర్ఓ ప్లాంట్ల పని తీరు పరిశీలించాలని పని చేయకుంటే తమ దృష్టికి తీసుకొస్తే మరమ్మతులు చేయిస్తామని అన్నారు. స్కూల్ కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు, గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలను సందర్శించాలని అన్నారు. కార్యక్రమంలో ఏపీవో జనరల్, ఇన్‌చార్జీ డీడీ జాదవ్ వసంతరావు, ఏడీఎంహెచ్‌వో కుడిమెత మనోహర్, తదితరులు పాల్గొన్నారు.



బోరింగ్‌గూడలో స్వాధీనం చేసుకున్న కలపతో అటవీశాఖ అధికారులు

కలప అక్రమ వ్యాపారం చట్టరీత్యా నేరం

● రూ.2 లక్షల విలువైన కలప పట్టివేత : రేంజ్ అధికారి

సిరికొండ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతంలో టేకు చెట్లను అక్రమంగా నరికి వ్యాపారం చేయడం చట్టరిత్యా నేరం, ఇలాంటి చర్యలకు పాల్పడితే అట్టివారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆదిలాబాద్ టాస్క్‌ఫోర్స్ రేంజ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని బోరింగ్‌గూడ గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన సుమారు రూ.2 లక్షల విలువైన టేకు దుంగలు, ఫర్నీచర్‌ను మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గత కొంతకాలంగా సిరికొండ మండలంలోని లచ్చింపూర్(బి) గ్రామ పంచాయతీ పరిధిలోని బోరింగ్‌గూడ గ్రామానికి చెందిన కినక గంగాప్రసాద్, కినక భీంరావ్, కినక అర్జున్‌ల సహాయంతో ఇచ్చోడ మండలంలోని గుండాల గ్రామానికి చెందిన హర్షద్ అనే వ్యక్తి అక్రమంగా అటవీ ప్రాంతం నుంచి టేకు చెట్లను నరికి తీసుకువచ్చి ఇళ్లల్లో నిల్వచేసి, ఫర్నిచర్ తయారు చేస్తూ జిల్లాలోని ఇతర ప్రాంతాలకు ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు ఉదయం తనిఖీలు నిర్వహించారు. కాగా టేకు దుంగలు, ఫర్నిచర్‌ను గుర్తించి స్వాధీనం చేసుకుని ఇచ్చోడ అటవీశాఖ డిపోకు తరలించినట్లు ఆయన తెలిపారు. నిందితులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆయన వెంట డీఆర్వోలు గీరయ్య, కవిత, ఏఎస్పై రమేష్, సెక్షన్ అధికారి మంజూర్ పాషా, బీట్ అధికారులు సజన్‌లాల్, శ్యాంసుందర్, కలెందర్, ఆడె సంతోష్, ప్రవళిక, హీరాలాల్, చరణ్‌సింగ్, అవినాష్, రాథోడ్ సంతోష్, ఆత్రం విజయ్, పోలీస్ బ్లూకోట్ సిబ్బంది, బేస్ క్యాంప్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న 11 నెలల బిల్లులను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు లింగాల చిన్నన్న అన్నారు. మంగళవారం తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం ఆధ్వర్యంలో బస్టాండ్ ఎదుట రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకురాలు సంగీత, రేఖ, కవిత, లక్ష్మి, సమీన, నఫీజ్, గంగామణి, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల ముందస్తు అరెస్టు

బోథ్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి చలో అసెంబ్లీ కార్యక్రమానికి పిలుపునివ్వడంతో బోథ్ నుంచి పారిశుధ్య కార్మికులు తరలి వెళ్లకుండా పోలీసులు పారిశుధ్య కార్మికులను అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం తెల్లవారకముందే వారిని అదుపులోకి తీసుకొని విడుదల చేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

నేరడిగొండ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన నాయిడి రాజన్నకు సీఎం సహాయ నిధి కింద రూ.60వేల చెక్కు మంజూరు కాగా.. కాంగ్రెస్ పార్టీ నాయకులు పంపిణీ చేశారు. పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ ఆదేశాల మేరకు మంగళవారం కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నాయిడి రవి పార్టీ నాయకులతో కలిసి వడూర్ గ్రామానికి చేరుకుని లబ్దిదారుడికి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో వీడీసీ చైర్మన్‌గా గాదెసంతోష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాలశంకర్, నవీన్, మహేందర్, బొలిశెట్టి రాములు, ఊశన్న, పెదబాపు, రామకృష్ణ, ఇసాక్, రాహిల్, అసిఫ్, కుంట శంకర్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులపై కేసులు ఎత్తివేయాలి

● ఆదిలాబాద్ జిల్లాలో అంబేద్కర్ విగ్రహాలకు బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో వినతి ● పెద్దసంఖ్యలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

ఆదిలాబాద్ అర్బన్, డిసెంబర్ 17(ఆంధ్రజ్యోతి): ఫార్మా కంపెనీ కోసం రైతుల భూములను దౌర్జన్యంగా లాక్కునేలా ప్రభుత్వం చేసిన కుట్రలను లగచర్ల రైతులు అడ్డుకున్నారని, వారిపై అక్రమ కేసులు పెట్టడం సరైన విధానం కాదని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్ అన్నారు. లగచర్ల రైతులకు మద్దతుగా బీఆర్‌ఎస్ పార్టీ పిలుపు మేరకు అంబేద్కర్ చౌక్‌లో మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్‌తో కలిసి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రహ్లాద్ మాట్లాడుతూ లగచర్లలో సీఎం రేవంత్‌రెడ్డి తన కుటుంబ సభ్యులకు ఫార్మా కంపెనీ ఏర్పాటుకు గిరిజన రైతుల నుంచి భూములను అక్రమంగా లాక్కుంటున్నారని ఆరోపించారు. ఆ క్రమంలో రైతులు తిరగబడ్డారన్నారు. రైతుల చేతులకు సంకెళ్లు వేసి జైళ్లకు తరలించడం నియంత పాలనకు నిదర్శనమన్నారు. రైతుల పై పెట్టిన కేసులను ఎత్తి వేసి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులకు అండగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ప్రకాష్, గంద్రత్‌రమేష్, సయ్యద్ సాజిదొద్దిన్, కొండ గణేష్, యూనీస్‌అక్బాని, సలీం పాసా, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

● రైతులపై అణిచి వేతలు అరికట్టాలి

ఉట్నూర్(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులపై అణిచివేతలకు పూనుకుంటుందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పంద్ర జైవంత్‌రావు ఆరోపించారు. మంగళవారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు ఉట్నూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి కాంగ్రెస్ ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలని కోరారు. ఇందులో భరత్‌చౌహాన్, కొమ్ముvిజయ్, సింగారే భారత్, కాటం రమేష్, దావుల రమేష్, కామెరరాజు, కరీం, ధరణి రాజేశ్, కోల సత్తెన్న, శ్యామ్, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

● రైతులను వెంటనే విడుదల చేయాలి

నేరడిగొండ(ఆంధ్రజ్యోతి): లగచర్ల రైతులపై అక్రమంగా కేసులు పెట్టి జైలులో నిర్భందించడం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ పాలనకు నిదర్శనమని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు, ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ఆదేశాల మేరకు మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఇందులో పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● రైతులపై అక్రమ కేసులను ఎత్తివేయాలి

సిరికొండ(ఆంధ్రజ్యోతి): లగచర్ల రైతులపై అక్రమంగా పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని బీఆర్‌ఎస్ మండల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ మండల అధ్యక్షుడు ఒరగంటి పెంటన్న ఆధ్వర్యంలో నాయకులు, రైతులు అంబేడ్కర్ చిత్రపటానికి వినతిపత్రం సమర్పించారు. ఇందులో కదం సూర్యకాంత్, రోహిదాస్, విజయ్‌కుమార్, లోకండే సునీల్, మల్లేష్, విజయ్‌కుమార్, ప్రకాష్, మల్లారెడ్డి, అజ్గర్, బాబు, మూసా, రాజు, మల్లేష్, సూర్యకాంత్, ప్రభాకర్, గంగన్న, నారాయణ, నర్సింలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



ఉట్నూర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న నాయకులు

● లగచర్ల రైతులను విడుదల చేయాలి

గుడిహత్నూర్(ఆంధ్రజ్యోతి): లగచర్ల ఘటనలో గిరిజనులపై పెట్టిన కేసులను తక్షణమే ఎత్తివేయాలని జైలు నుంచి విడుదల చేయాలని కోరుతూ మంగళవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. ఇందులో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుమల్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ ముండే సంజీవ్, నాయకులు ఆశన్న యాదవ్, రంగు శ్రీనివాస్ గౌడ్, భీంరావ్, రవినాయక్, పాటిల్ రాందాస్, తెలంగే మాధవ్, ముండే రాహుల్, కేంద్రే వెంకట్రావ్, తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి(ఆంధ్రజ్యోతి): లగచర్ల రైతులపై పెట్టిన అక్రమ కేసులు వెంటనే ఎత్తివేయాలని, వారిని వెంటనే విడుదల చేయాలని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ డోంగ్రే మారుతి పటేల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మంగళవారం మండల కేంద్రంలోని బీఆర్.అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. ఇందులో మీర్జా జీలానీ బేగ్, మడావి భీంరావ్, షేక్ సూఫీయాన్, అంజద్, ధరణి ధనరాజ్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

తలమడుగు(ఆంధ్రజ్యోతి): మహబూబానగర్ జిల్లా లగచర్ల రైతులపై పెట్టిన కేసులను మాఫీ చేసి వెంటనే వారిని విడుదల చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని సుంకిడి గ్రామంలో. అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని సమర్పించి నిరసన వ్యక్తం చేశారు. ఇందులో మండల కన్వీనర్ తోట వెంకటేష్, జిల్లా నాయకులు పిడుగు అభిరామ్‌రెడ్డి, కిరణ్‌కుమార్, అబ్దుల్లా సుదర్శన్‌రెడ్డి, కుచలాపూర్ జనార్ధన్, తోట శీను మగ్గిడి, ప్రకాష్, గంగాధర్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడ(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో నిర్వహించిన కార్య క్రమంలో బీఆర్‌ఎస్ మండల అద్యక్షుడు ఏనుగు కృష్ణారెడ్డి, తదితరులున్నారు.

అలాగే.. బోథ్, బజార్‌హత్నూర్‌తో పాటు ఆయా మండలాల్లో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి : ఆడె

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): బజార్‌హత్నూర్ మండలంలోని డెడ్రా గ్రామంలో ఇటీవల చిరుతపులి దాడిలో తీవ్ర గాయాలపాలై ఆదిలాబాద్ రిమ్స్ సూపర్ స్పెషాలిటీలో చికిత్స పొందుతున్న మహిళను మంగళవారం కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్ పరామర్శించారు. రిమ్స్ డైరెక్టర్‌తో మాట్లాడి మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. ఆయన వెంట ఆదిలాబాద్ జిల్లా యవజన కాంగ్రెస్ ప్రెసిడెంట్ చరణ్ గౌడ్, బోథ్ నియోజకవర్గ యవజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్ధం పోతారెడ్డి, ఆదిలాబాద్ నియోజకవర్గ యవజన ఉపాధ్యక్షుడు సామ రూపేష్‌రెడ్డి, మండలాధ్యక్షుడు యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు హీర్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న నాయకుడు

నార్నూర్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): గాదిగూడ మండలం బుడుకుం లోకరి గ్రామం దగ్గర మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు బోల్తా పడింది. ఈ విషయం తెలుసుకున్న ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల కార్యదర్శి పెందోర్ సంతోష్ హుటాహుటిన సంఘటన స్థలానికి వెళ్లారు. ఈ ఘటనలో బోల్తా పడ్డ కారు నుంచి ప్రమాదానికి గాయపడిన వారిని బయటకు తీశారు. అప్పటికప్పుడు వెంటనే 108 అంబులెన్స్ వాహనంలో క్షతగాత్రులను మెరుగైన చికిత్స కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కి పంపించారు. గాయపడ్డ వారు గుడిహత్నూర్ మండలం మన్నూర్ గ్రామానికి చెందిన వారు అని ఆయన తెలిపారు. ఆయన వెంట గ్రామస్థులు మేస్రం జైతు, నేతం సోనేరావు, తదితరులున్నారు.

మైక్రో ఫైనాన్స్ మాఫియా

(5వ పేజీ తరువాయి...)

ఇస్తున్నట్లు తెలుస్తుంది. ఎలాంటి పెట్టుబడి, ఖర్చు లేకుండా తేలికగానే వస్తున్న అప్పులకు అలవాటు పడిన కొందరు మైక్రోఫైనాన్స్ మాఫియా మాయలో పడి తీవ్రంగా నష్టపోతున్నారు. రెక్కాడితే కాని డొక్కాడని అమాయక ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నారు. డెయిలీ, వీక్లీ, మంత్లీ పేరిట అప్పులు ఇస్తూ వాయిదాల పద్ధతిలో వసూళ్లు చేస్తున్నారు. తెల్లవారు జామున సాయంత్రం వేళల్లో ఇంటికి వచ్చి వడ్డీ, అసలుతో సహా వాయిదాలను చెల్లించాలని ముక్కుపిండి మరీ వసూళ్లు చేస్తున్నారు. ఇదంతా బహిరంగంగానే జరుగుతున్నా.. అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వడ్డీ వ్యాపారుల ఆగడాలను తట్టుకోలేక చిరు వ్యాపారులు, అమాయక కూలీలు, గిరిజనులు నిత్యం భయాందోళనకు గురవుతున్నారు. కొన్ని సందర్భాల్లో ఇంట్లోకి చొరబడి వాయిదాలు చెల్లించాలంటూ బలవంతానికి దిగుతున్నా.. అధికారులు అడ్డుకట్ట వేయలేక పోతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. మైక్రోఫైనాన్స్ రుణాలపై ఏమాత్రం అవగాహన లేని అమాయక నిరుపేదలు అప్పులు చెల్లించేందుకు మళ్లీ అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. చేసిన కష్టమంతా ఫైనాన్స్ వాయిదాలు, వడ్డీలకే సరిపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని పలువురు మహిళలు వాపోతున్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల అమలులో విశ్రాంత ఉద్యోగుల పాత్ర ఎంతో ఉంటుందని, ఇటీవల జరిగిన సమగ్ర కుటుంబ సర్వేలో వారి సహకారం ఎంతో ఉందని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం టీఎన్జీఓస్ భవనంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పెన్షనర్ డేను పురస్కరించుకొని విశ్రాంత ఉద్యోగులకు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన సాంస్కృతిక నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, సీనియర్ సిటీజన్ డాక్టర్ దేవిదాస్ దేశ్‌పాండే, కిష్ట రెడ్డి, వైద్యులు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

పదోన్నతితో మరింత బాధ్యత : ఎస్పీ

ఆదిలాబాద్ అర్బన్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పదోన్నతితో మరింత బాధ్యతలు పెరుగుతాయని ఎస్పీ గౌస్‌ఆలం తెలిపారు. జిల్లా పోలీసు సాయుధ దళంలో అసిస్టెంట్ రిజర్వ్ సబ్ ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న అనుముల ఊశన్న రిజర్వ్ సబ్ ఇన్స్‌పెక్టర్‌గా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా మంగళవారం పోలీసు ముఖ్య కార్యాలయంలో ఎస్పీని కలిసి పూలమొక్క అందజేశారు. పదోన్నతి పొందిన రిజర్వ్ సబ్‌ఇన్‌స్పెక్టర్ అనుముల ఊశన్న భుజాలపై పదోన్నతి చిహ్నాం స్టార్‌ను అలంకరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సీసీ దుర్గం శ్రీనివాస్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ డి.వెంకటి, సిబ్బంది, తదితరులున్నారు.

ఖాళీ టీ కప్పులతో ఉద్యోగుల నిరసన

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలను చాయి తాగేంతా సమయంలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చి ఏడాది గడుస్తున్నా.. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటి వరకు స్పందించ లేదని సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం ఇచ్చిన మాటను గుర్తు చేసేలా మంగళవారం తెలంగాణ చౌక్ వద్ద ఖాళీ టీ కప్పులతో నిరసన తెలిపారు. ఇప్పటికైనా ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేసి సీఎం తమ మాట నిలుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగులు పాల్గొన్నారు.

'ఇళ్ల స్థలాలు సాధించే వరకు ఉద్యమిస్తాం'

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు సాధించే వరకు తమ సంఘం ఉద్యమిస్తుందని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఐజేయూ జిల్లా కన్వీనర్ దేవిదాస్, కోకన్వీనర్ రాజేశ్వర్ అన్నారు. మంగళవారం టీఎన్జీఓస్ భవనంలో సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఆయా సంస్థల్లో పని చేస్తున్న జర్నలిస్టులకు సభ్యత్వాలు అందించారు. అనంతరం జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై సంఘం సభ్యులతో పాటు సీనియర్ పాత్రికేయులు చర్చించారు. ఈ సందర్భంగా కన్వీనర్ దేవిదాస్ మాట్లాడుతూ హక్కుతోపాటు ఎన్నో ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల విషయంలో సంఘం ఉద్యమిస్తుందన్నారు. జర్నలిస్టులు ఐక్యంగా ఉంటూ సాధించుకోవాలన్నారు.

ఖానాపూర్‌ను రెవెన్యూ డివిజన్‌గా మార్చండి

● సిద్దిపేట నుంచి వచ్చే బస్సులను గొడిసిర్యాల మీదుగా దారి మళ్లించండి
● అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని కోరిన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



ఖానాపూర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్‌ను రెవెన్యూ డివిజన్‌గా మార్చాలని స్థానిక ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ... గత ముఖ్యమంత్రి కేసీఆర్ ఖానాపూర్ ప్రాంతాన్ని రెవెన్యూ డివిజన్‌గా మారుస్తామని హామీ ఇచ్చి రెండుసార్లు ఆ ప్రాంతంలో గెలుపొంది ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేక ఆ ప్రాంత ప్రజలకు అన్యాయం చేశారన్నారు. గత ఎన్నికల్లో ఖానాపూర్ ప్రాంత ప్రజల కోరిక మేరకు ఖానాపూర్‌ను రెవెన్యూ డివిజన్‌గా మారుస్తామని తాము కూడా హామీ ఇచ్చామన్నారు. ఖానాపూర్ ప్రాంతంలో ఎన్నో రోజులుగా ఆ ప్రాంతాన్ని రెవెన్యూ డివిజన్‌గా మార్చాలని ప్రజల్లో బలమైన కోరిక ఉందని వారి కోరిక నెరవేర్చాలని ప్రభుత్వం ఖానాపూర్ రెవెన్యూ డివిజన్‌గా మార్చాలని కోరారు. సిద్దిపేట ప్రాంతం నుండి వచ్చే బస్సులను రూట్ మళ్లించి దస్తురాబాద్‌మండలం గొడిసిర్యాల మీదుగా నడిపేలా చర్యలు చేపట్టాలని రవాణాశాఖ మంత్రిని అసెంబ్లీ వేదికగా ఎమ్మెల్యే బొజ్జు కోరారు. ఎన్నో ఏళ్లుగా ఖానాపూర్ ప్రాంత ప్రజలు ఎదురుచూస్తున్న రెవెన్యూ డివిజన్ ఏర్పాటు ప్రక్రియను అసెంబ్లీలో ఎమ్మెల్యే బొజ్జు ప్రస్తావించడం పట్ల ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం సైతం వెంటనే స్పందించి ఖానాపూర్ ప్రాంతాన్ని రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలన్నారు.

లగచర్ల రైతులపై పెట్టిన

అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలి

● బీఆర్‌ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్



ఖానాపూర్‌లో మాట్లాడుతున్న జాన్సన్ నాయక్..బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

ఖానాపూర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్ల రైతులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఉప సంహరించుకోవాలని బీఆర్‌ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్ అన్నారు. లగచర్ల రైతుల పట్ల తెలంగాణ ప్రభుత్వం వ్యవహరిస్తున్న ధోరణికి నిరసనగా మంగళవారం నియోజకవర్గ కేంద్రంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జాన్సన్ నాయక్ నివాసం నుండి పాత బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. పలు డిమాండ్‌తో కూడిన వినతిపత్రాన్ని అంబేద్కర్ విగ్రహానికి అందజేశారు. అనంతరం జాన్సన్‌నాయక్ మాట్లాడుతూ... లగచర్లలో రైతులు చేసిన తప్పేంటి అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తమ భూములను ప్రభుత్వానికి ఇవ్వమని చెప్పడం వారు చేసిన నేరం ఎలా అవుతుందన్నారు. ఎకరానికి 40 నుండి 50 లక్షల రూపాయలు ఉన్న వ్యవసాయ భూములను తక్కువ ధరలకు ప్రభుత్వానికి ఇవ్వమంటే రైతులు ఎలా ఇస్తారన్నారు. రేవంత్‌రెడ్డి మాటపై భూములను ఇవ్వక పోవడంతోనే లగచర్ల రైతులపై కక్షగట్టి 40 మందిపై అక్రమకేసులు బనాయించారని ఆరోపించారు. జైళ్లో అనారోగ్యానికి గురైన రైతు హిర్యానాయక్ చేతులకు బేడీలు వేసి ఆసుపత్రికి తీసుకెళ్లడం రేవంత్‌రెడ్డి ఉన్మాద ధోరణికి నిదర్శనమని మండిపడ్డారు. లగచర్లలో దళిత గిరిజన బిడ్డలను అక్రమంగా అరెస్ట్ చేసి జైళ్లో పెట్టడం తనను తీవ్రంగా కలచి వేసిందన్నారు. తాను స్వయంగా జైలుకు వెళ్లి ఆ రైతులతో మాట్లాడిన తర్వాత ఈ ప్రభుత్వ నిరంకుశత్వ ధోరణి అర్థం అయ్యిందన్నారు. రాజ్యాంగ వ్యతిరేక చర్యలను మానుకొని లగచర్ల రైతులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేసి వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా తమ ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్య క్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ కరిపే శ్రీనివాస్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ 8వ వార్డు కౌన్సిలర్ అబ్దుల్‌ఖలీల్, తిమ్మాపూర్ వీడీసీ అధ్యక్షులు బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు బీసీ రాజన్న, భీమాజీ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి



రిటైర్డ్ ఉద్యోగిని సన్మానిస్తున్న ఎస్‌టీవో నాజీమ్ మహ్మద్

భైంసా, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రణాళికబద్దమైన విధానాల ద్వారా పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి బాధ్యతాయుతతో కృషి చేస్తామని భైంసా ఎస్‌టీవో నాజీమ్ మహ్మద్, ఏటీవో గంగాధరయ్యలు పేర్కొన్నారు. మంగళవారం భైంసాలోని పెన్షనర్స్ భవన్‌లో జరిగిన పెన్షనర్ల దినోత్సవ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. పెన్షనర్లకు ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని రకాల చెల్లింపులు సకాలంలో జరిగే విధంగా చూస్తామని తెలిపారు. చెల్లింపులకు సంబంధించి ఎలాంటి సమస్యలున్న తమ దృష్టికి తీసుకవచ్చి పరిష్కరించుకోవాలని వెల్లడించారు. పెన్షనర్ల సంఘం భైంసా డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగనాథ్, శక్కెర భాస్కర్‌రావ్‌లు మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన ఉద్యోగుల పెన్షన్ హక్కును చట్టబద్దత కల్పించాలన్నారు. వెల్‌నెస్ సెంటర్లు, సూపర్ స్పెషాలిటి ఆసుపత్రులలో ఓపీ చీటీల కోసం గంటల తరబడి వరుసలో నిల్చునేందుకు పడుతున్న ఇబ్బందులను తొలగించేందుకు గాను తమ కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌కు సంబంధించి సత్వర చెల్లింపులు జరిగేలా చూడాలన్నారు. పెన్షనర్లు తమ సమస్యలను కార్యవర్గం దృష్టికి తీసుకవస్తే పరిష్కరించుకునేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తామని వెల్లడించారు. వేడుకల్లో భాగంగా పెన్షన్ కోసం పోరాడిన డీఎస్ నకార చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా 75 సంవత్సరాల వయస్సు గల 18 మంది రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షనర్ల సంఘం ఘనంగా సన్మానించి జ్ఞాపికలు బహూకరించింది.

ముథోల్ నియోజకవర్గంలో కొత్తగా

మూడు మండలాలను ఏర్పాటు చేయాలి

● అసెంబ్లీలో ముథోల్ ఎమ్మెల్యే రాంరావ్ పాటిల్ డిమాండ్



భైంసా, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తమ నియోజక వర్గ పరిధిలో కొత్తగా మూడు మండలాలను ఏర్పాటు చేయాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మంగళవారం అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్ సంబంధిత విషయంలో మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సెప్టెంబర్ 2023 సంవత్సరములో నియోజక వర్గ పరిధిలో మాలేగాం, బెల్‌తరోడా గ్రామాలను కొత్త మండలాలుగా ప్రకటించిందన్నారు. ఇదే క్రమంలో ఎన్నికల సమయంలో పల్సిని మండల కేంద్రంగా ఏర్పాటుకు హామీ ఇచ్చిందన్నారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 30 మండలాలను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అయితే ఇందులో నియోజక వర్గ పరిధిలో ఇది వరకు ప్రకటించిన మండలాలకు చోటు దక్కలేదని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంబంధిత విషయంలో తక్షణమే స్పందించి నియోజక వర్గ పరిధిలో గత ప్రభుత్వం ప్రకటించిన బెల్‌తరోడా,మాలేగాం కేంద్రాలతో పాటు కొత్తగా పల్సిని సైతం మండలాల కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు స్పందనగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఎమ్మెల్యేల విజ్ఞప్తులను, విన్నపాలను పరిగణలోకి తీసుకుంటామని వెల్లడించారు.

ఏరియా ఆసుపత్రిలో

అలజడి రేపిన భర్త కోసం భార్య ఆందోళన

● భర్త కోసం శానిటేషన్ గది ముందు వెతుకులాట, బైఠాయింపు ● గదికి తాళం వేసి వెళ్లిపోయిన శానిటేషన్ విభాగపు మహిళ ● అభాసుపాలవుతున్న ఆసుపత్రి నిర్వహణ



భైంసా ఏరియా ఆసుపత్రి



శానిటేషన్ నిర్వహణ గది ముందు బైఠాయించిన గృహిణి

భైంసా, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో సోమవారం రాత్రి వేళలో ఒక గృహిణి తన భర్త కోసం చేపట్టిన ఆందోళన అలజడి రేపింది. స్థానిక రాజీవ్‌నగర్ కాలనీలో నివాసముంటున్న గృహిణి రాత్రి వేళలో ఏరియా ఆసుపత్రికి చేరుకొని అందులోని శానిటేషన్ నిర్వహిస్తున్న గది ముందు తన భర్త కోసం వెతుకలాడింది. ఇదే సమయంలో సంబంధిత గదిలో నున్న శానిటేషన్ విభాగానికి చెందిన మహిళ ఒకరు గృహిణిని గుర్తించి హుటహుటిన బయటకు వచ్చి సంబంధిత గదికి తాళం వేసి అక్కడి నుంచి నిష్క్రమించినట్లుగా తెలిసింది. అయితే సదరు గృహిణి తన భర్త సంబంధిత గదిలోనే ఉన్నాడని, ఆయనను తనకు అప్పగించాలంటూ తాళం వేసి ఉన్న గది ముందు బైఠాయించింది. గంటన్నర పైగా కాలం గృహిణి అక్కడే బైఠాయించి ఆందోళనలు చేపట్టింది. శానిటేషన్ గదికి తాళం వేసి వెళ్లిపోయిన సంబంధిత విభాగపు మహిళపై సదరు గృహిణి శాపనార్థాలు పెడుతూ పలు ఆరోపణలు చేసినట్లుగా తెలిసింది. చివరకు గృహిణికి సంబంధించిన కుటుంబీకులు ఏరియా ఆసుపత్రికి చేరుకొని అమెను సముదాయించి శాంతపరిచినట్లుగా సమాచారం. ఇంటికి వెళ్లి అక్కడే అన్ని మాట్లాడుకొని సమస్య పరిష్కరించుకుందామని చెప్పి గృహిణిని అక్కడి నుంచి తీసుకవెళ్లినట్లుగా సమాచారం. గృహిణి అక్కడి నుంచి వెళ్లిపోయిన అర్ధగంట అనంతరం రాత్రి 11 గంటల ప్రాంతంలో ఒక వ్యక్తి వచ్చి శానిటేషన్ గదికి వెసిన తాళం తీయగా అందులోనున్న సదరు గృహిణి భర్త పరుగుపరుగున గదిలో నుంచి బయటకు వచ్చి ఆసుపత్రిలోని వెనుకవైపు మార్గం ద్వారా బయటకు వెళ్లిపోయినట్లుగా తెలిసింది. ఏరియా ఆసుపత్రిలో తరచూ ఏదో ఒక ఘటన చోటు చేసుకుంటూ నిర్వహణ వ్యవస్థ అబాసుపాలవుతోంది.రాత్రి వేళలో చోటుచేసుకున్న ఘటనపై పట్టణ వ్యాప్తంగా తీవ్ర జరిగింది. సంబంధిత విషయంలో ఏరియా ఆసుపత్రి సూపరింటెంట్ డా. కాశీనాథ్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా ఘటనపై ఒక వ్యక్తి మౌఖికంగా తమకు ఫిర్యాదు చేసినట్లుగా తెలిపారు. సంబంధిత వ్యక్తికి లేఖ ద్వారా ఫిర్యాదు అందించాల్సిందిగా సూచించినట్లుగా వివరించారు. ఆసుపత్రిలోని సీసీ ఫుటేజీని పరిశీలించి సంబంధిత అంశాన్నీ హెచ్‌ఎసీ చైర్మెన్‌గానున్న ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్ దృష్టికి తీసుకవెళ్లి తగు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పనిచేయాలి

● డీఐఈవో జాదవ్ పరుశురామ్ నాయక్

భైంసా, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించే లక్ష్యంతో అధ్యాపకులు చర్యలు చేపట్టాలని డీఐఈవో జాదవ్ పరుశురామ్‌నాయక్ సూచించారు. మంగళవారం భైంసా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా తరగతుల్లోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. సబ్జక్టుల వారీగా వివరాలను అడిగి తెలుసుకున్నారు. వార్షిక పరీక్షల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఉత్తమ ఫలితాల సాధన దిశగా ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ శివరంజని నేతృత్వంలో అధ్యాపకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉదయం, సాయంత్రం వేళలో క్రమం తప్పకుండా స్టడీ అవర్స్ కొనసాగించాలని సూచించారు. సబ్జక్ట్ పూర్తయిన అధ్యాపకులు పునశ్చరణ తరగతులు చేపట్టాలని ఆదేశించారు. వార్షిక పరీక్షల్లో తమ తమ సబ్జక్టుల్లో విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికబద్దమైన రీతిలో సన్నద్ధం చేయాలని స్పష్టం చేశారు. సమయపాలన పాటిస్తూ అలసత్వ విదానాలకు తావులేకుండా విద్యార్థులను పరీక్షల కోసం సమయాత్తం చేయాలన్నారు. అనంతరం కళాశాల నిర్వాహణ వ్యవస్థను పర్యవేక్షించి రికార్డు బుక్కులను పరిశీలించారు.

గల్ఫ్ మృతుల

కుటుంబాలకు ప్రభుత్వం బాసట

● భైంసా ఏఎంసీ చైర్మన్ సిందే ఆనంద్‌రావ్ పాటిల్

భైంసా, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లి అక్కడ వివిధ కారణాలతో మృతి చెందిన బాధిత కుటుంబాలకు రేవంత్ రెడ్డి సారధ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం బాసటగా నిలుస్తోందని భైంసా ఏఎంసీ చైర్మెన్ సిందే ఆనంద్‌రావ్ పాటిల్ వెల్లడించారు.మంగళవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో గల్ఫ్ మృతుల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి మంజూరైన ఆర్థిక సాయపు మంజూరి పత్రాలను పంపిణీ చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

భక్తి



ఉత్సవ మూర్తికి నిర్వహిస్తున్న పల్లకీ సేవ నిర్వహిస్తున్న స్వాములు

నేత్రపర్వంగా ఆరట్టు మహోత్సవం

- పురవీధుల్లో ఉత్సవ మూర్తికి శోభాయాత్ర
- ఇంటింటా పూలు చల్లుతూ స్వాగతం పలికిన మహిళలు
- భారీగా హాజరైన అయ్యప్ప దీక్షదారులు, భక్తులు



ప్రత్యేక వాహనంపై అయ్యప్ప స్వామి విగ్రహం ఊరేగింపు

భైంసా,డిసెంబరు17: మహిమాన్విత క్షేత్రంగా విరాజిల్లుతున్న భైంసాలోని అయ్యప్పక్షేత్రంలో మంగళవారం ఆరట్టు మహోత్సవాలు నేత్రపర్వంగా సాగాయి. వేకువ జామువేళలో ప్రత్యేక అభిషేక పూజలతో ప్రారంభమైన ఉత్సవాలు రాత్రి వేళలో నిర్వహించిన మండల పూజ వేడుక ముగిసే వరకు భక్తుల కోలాహలం మధ్య ఘనంగా కొనసాగాయి. వేడుకలలో భాగంగా ఉదయం వేళలో అయ్యప్పక్షేత్రం నుంచి ప్రత్యేక వాహనంపై అయ్యప్ప స్వామి విగ్రహాన్ని, పల్లకిలో ఉత్సవ మూర్తికి పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా గడ్డెన్నవాగు ప్రాజెక్టు వరకు శోభాయాత్ర చేపట్టారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు మంత్రి సాయినాథ్ చేతుల మీదుగా ప్రాజెక్టు వద్ద ఉత్సవ మూర్తికి జలాభిషేకం చేపట్టారు. అనంతరం అయ్యప్ప క్షేత్రానికి తిరిగి వెళ్లి పూజలు, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి వేళలో క్షేత్రంలో మండల పూజ చేపట్టారు.

● శోభాయాత్రకు ఇంటింటా స్వాగతాలు

ఆరట్టు మహోత్సవములో భాగంగా పట్టణంలోని పుర వీధుల్లో అయ్యప్ప స్వామి ఉత్సవమూర్తి, విగ్రహాలకు చేపట్టిన శోభాయాత్రకు భక్తుల నుంచి అపూర్వ స్పందన లభించింది. శోభాయాత్ర కొనసాగిన మార్గాల్లో మహిళా భక్తులు పల్లకి, ప్రత్యేక వాహనాల్లోని అయ్యప్ప స్వామి ఉత్సవ మూర్తి, విగ్రహాలతోపాటు దీక్షదారులపై పూలు చల్లుతూ స్వాగతం పలికారు. ఇంటింటా మంగళహరతులతో స్వాగతం పలికి ఉత్సవమూర్తి, విగ్రహానికి పూజలు చేపట్టారు. శోభాయాత్ర మార్గంలోని నివాస గృహాలకు చెందిన మహిళలు తమ తమ ఇళ్ల ముందు కళ్లాపుచల్లి, రంగురంగులతో అందమైన రంగువల్లులను వేసి శోభాయమానంగా తీర్చిదిద్దారు.

● మార్మోగిన అయ్యప్ప నామస్మరణ

పట్టణంలోని ప్రధాన కాలనీలు అయ్యప్ప నామ స్మరణతో మారుమోగిపోయాయి. ఆరట్టు మహోత్సవంలో భాగంగా చేపట్టిన శోభాయాత్రకు డివిజన్ పరిధిలో వివిధ ప్రాంతాలకు చెందిన వేయిమందికిపైగా అయ్యప్ప దీక్షదారులు పాల్గొన్నారు. వీరితోపాటు భక్తులు అంతకు మించిన సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని దీక్షదారులు, భక్తులు చేపట్టిన శరణుఘోషతో శోభయాత్ర మార్గం మారుమోగిపోయింది. అయ్యప్ప స్వామి గేయాలు ఆలపిస్తూ దీక్షదారులు చేపట్టిన ఆధ్యాత్మిక నృత్యాలు శోభాయాత్రకు వన్నెతెచ్చాయి.



● ఉత్సవంలో పాల్గొన్న మహిళా భక్తులు



శోభాయాత్రలో పాల్గొన్న అయ్యప్ప స్వామి దీక్షదారులు



● శిథిలదశకు చేరుకుంటున్న సీడీపీవో కార్యాలయ భవనం

ఆంధ్రజ్యోతి ఫోకస్

సీడీపీవో కార్యాలయాన్ని వినియోగించేదెప్పుడు?

- కార్యాలయాన్ని ఐటీడీఏ సముదాయంలోకి మార్చిన పీవో ● అప్పటినుంచి ఖాళీగా సీడీపీవో భవనం
- నిర్వహణ లేక శిథిలావస్థకు.. ● సిబ్బందికి దూరభారం ● మూలనపడి తుక్కుగా మారిన వాహనాలు

ఉట్నూర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సమగ్ర బాలాభ్యుదయ ప్రాజెక్టు కార్యాలయ భవనం ఆలనాపాలన లేకపోవడంతో శిథిలదశకు చేరుతోంది. 1980 ప్రాంతంలో నిర్మించిన సీడీపీవో కార్యాలయ భవనం సరిపోవడం లేదని భావించిన అధికారులు లక్షల రూపాయలు వెచ్చించి పాత భవనం సమీపంలోనే మండల పరిషత్ కార్యాలయం వద్ద సీడీపీవో కార్యాలయ భవనం నిర్మించారు. ఆ రోజుల్లో ఉట్నూర్ సీడీపీవో కార్యాలయం పరిధిలో ఉట్నూర్, నార్నూర్, ఇంద్రవెల్లి, జైనూర్, సిర్పూర్ యూ మండలాల గ్రామాలు ఉండేవి. ఆయా మండలాల గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లు ఉట్నూర్‌కు చేరుకుని బస్టాండ్‌కు సమీపంలో ఉన్న కార్యాలయానికి వచ్చి వెళ్లేవారు. జిల్లాల విభజన అనంతరంతో పాటు నార్నూర్ మండలకేంద్రంలో కూడా కొత్తగా సీడీపీవో కార్యాలయాన్ని మంజూరుచేసిన ప్రభుత్వం గాదిగూడ, నార్నూర్ మండలాలను ఉట్నూర్ ప్రాజెక్టు నుంచి వేరుచేయడంతో ఉట్నూర్ ఇంద్రవెల్లి మండలాలకు ప్రత్యేకంగా ఉట్నూర్‌లో సీడీపీవో కార్యాలయం ఉండేది. ఈ రెండు మండలాల్లో పనిచేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది టీచర్లు, ఆయా లు వివిధ శిక్షణలతో పాటు పనుల కోసం ఉట్నూర్ వచ్చి వెళ్తుంటారు. గత ఐదేళ్ల క్రితం ఇక్కడ ఐటీడీఏ పీవోగా పనిచేసిన కృష్ణ ఆదిత్య బస్టాండ్ సమీపంలో ఉన్న కార్యాలయాన్ని ఐటీడీఏ సముదాయంలోకి మార్చారు. దీంతో సీడీపీవో కార్యాలయం ఆలనా పాలన లేక పాత సీడీపీవో కార్యాలయం భవనం శిథిలంగా మారుతోంది. భవనం కోసం వెచ్చించిన లక్షలు రూపాయలు వృథా అవుతున్నాయి.

● మూలన పడిన వాహనాలు

గిరిజన గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షించడానికి సీడీపీవోకు ప్రభుత్వం వాహన సౌకర్యం కల్పించింది. ఒక జీపు పాత పడడంతో, మరో కొత్త జీపును కేటాయించింది. కార్యాలయం జీపు డ్రైవర్ పదవి విరమణ చేయడంతో కొత్తడ్రైవర్ నియామకంలో ఉన్నతాధికారులు అలసత్వం చేయడంతో జీపు నడిపించే వారు లేక మూలన పడింది. పదేళ్లుగా వాహనం కదలక పోవడంతో పూర్తిగా చెడిపోయింది. రెండు పాత జీపులతోపాటు ఒక ట్రాలీ కార్యాలయం సమీపంలోనే ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ పనికా రాకుండా పోతున్నాయి. ప్రస్తుతం ఆ వాహనాలు తుక్కు దుకాణంలో అమ్మే విధంగా తయారయ్యాయి. బస్టాండ్ సమీపంలో ఉన్న సీడీపీవో కార్యాలయాన్ని ఐటీడీఏ ప్రాంగణంలోకి మార్చడంతో దూరప్రాంతాల నుంచి వస్తున్న తాము బస్టాండ్ నుంచి ఐటీడీఏ వరకు వెళ్లాలంటే ఆటోలకు అధిక డబ్బులు చెల్లించి ఆర్థిక ఇబ్బందులకు గురి అవుతున్నామని అంగన్‌వాడీ టీచర్లతోపాటు ఉద్యోగులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సిబ్బంది ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని తమపాత కార్యాలయంలోని ఐసీడీఎస్ సీడీపీవో కార్యాలయాన్ని కొనసాగించాలని ఉద్యోగులు కోరుతున్నారు.



చెడిపోయిన జీపు



సామాన్లు మోసే ట్రాలీలో పెరిగిన పిచ్చిమొక్కలు



పూర్తిగా శిథిలమైన సీడీపీఓ కార్యాలయం పాత భవనం



పూర్తిగా చెడిపోయిన జీపు

స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ స్టేషన్ల జాబితా సిద్ధం



పోలింగ్ స్టేషన్ల జాబితాను విడుదల చేస్తున్న ఎంపీడీవో

బోథ్, డిసెంబరు17 (ఆంధ్రజ్యోతి): ప్రధాన ఉన్న స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ స్టేషన్లను ఇప్పటికే గుర్తించారు. వీటికి సంబంధించిన జాబితా మంగళవారం ఎంపీడీవో రమేష్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఓ వాజిద్ అలీ, ఎంపీడీవో, సిబ్బంది పాల్గొన్నారు.

పోరాడితేనే సమస్యల పరిష్కారం

- డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శామ్యూల్ ● రెండోరోజుకు చేరిన సీఆర్టీల నిరవధిక సమ్మె

ఉట్నూర్, డిసెంబరు17 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ గిరిజన సంక్షేమ శాఖ కాంట్రాక్ట్ రెసిడెన్షిటీచర్లు సంఘటితమై పోరాడాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ముడుగు శామ్యూల్ పిలుపునిచ్చారు. మంగళవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ముందు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన సంక్షేమశాఖ ఆసరా పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్టీలో తలపెట్టిన నిరవధిక సమ్మె రెండోరోజుకు చేరింది. రెండు దశాబ్దాలకు పైగా సీఆర్టీలు పని చేస్తున్న ప్రభుత్వాలు సీఆర్టీల ఉద్యోగాలన క్రమబద్ధీకరించడం లేదని విమర్శించారు. ఐటీడీఏలో విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఏజెన్సీ డీఈఓ లేకుండా చేశారని ఆరోపించారు. ఐటీడీఏ విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని పర్యవేక్షణ అధికారులు లేకపోవడంతో గిరిజన విద్య కుంటు పడడమే కాకుండా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేవారు కరువయ్యారని అన్నారు. సీఆర్టీలో అందరు ఐక్యమత్యంతో ముందుకు వెళ్లాలని అన్నారు. ఈ సందర్భంగా సీఆర్టీ సంఘ నాయకులు మాట్లాడుతూ ఏటురు నాగారం, భద్రాచలం ఐటీడీఏ ప్రాంతాలలోని సీఆర్టీలో సైతం నిరవధిక సమ్మెకు కలిసి వస్తామని సమాచారం ఇస్తున్నందున సీఆర్టీలు ఎలాంటి అభద్రతభావానికి గురికాకుండా సమస్యలు పరిష్కారం అయ్యేవరకు నిరవధిక సమ్మె శిబిరానికి తరలిరావాలని కోరారు. సీఆర్టీలకు ఉద్యోగ భద్రత కల్పించి మినిమం టైం స్కేల్ ఇవ్వాలని, ప్రతీనెల ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని, మహిళా సీఆర్టీలకు 180 రోజుల ప్రసూతి సెలవులు వర్తింప చేయాలని, తదితర డిమాండ్లను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు భరత్‌చౌహాన్, డీటీఎఫ్ జిల్లా కార్యదర్శి భాను కవిత ప్రకాష్, ఆసిఫాబాద్ ఆదిలాబాద్ మంచిర్యాల, నిర్మల్ జిల్లాల సీఆర్టీల సంఘం నాయకులు తదితరులున్నారు.



నిరవధిక సమ్మెలో మాట్లాడుతున్న ముడుగు శామ్యూల్

బాల్యవివాహ రహిత భారత్‌కు కృషిచేద్దాం



మాట్లాడుతున్న బాలలహక్కుల సంరక్షణ అధికారి రాజేంద్రప్రసాద్

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహ రహిత భారతదేశం కోసం ప్రతీఒక్కరు కృషిచేయాలని బాలల హక్కుల సంరక్షణ అధికారి రాజేంద్ర ప్రసాద్ అన్నారు. ఆదిలాబాద్‌లోని మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల కళాశాలలో షూర్ ఎన్జీవో ఆధ్వర్యంలో బాల్య వివాహాలు, బాల కార్మికుల నిర్మూలన గురించి అవగాహన కల్పించారు. సఖీకేంద్రం సేవలు, మహిళాసాధికారత, హెల్ప్‌లైన్‌నెంబర్లపై విస్తృతంగా అవగాహన కల్పించారు. బాలికలు చదువుల్లో రాణించాలని చెప్పారు.



ఆదిలాబాద్‌ను కమ్మేసిన దట్టమైన పొగమంచు

చలితో జనం వణుకు!

- బేలలో 5.8 కనిష్ఠ ఉష్ణోగ్రతల నమోదు

ఆదిలాబాద్, డిసెంబరు17 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలో రికార్డు స్థాయిలో నమోదవుతున్న చలితో జనం వణికిపోతున్నారు. మంగళవారం జిల్లా గరిష్ఠ ఉష్ణోగ్రత 29.0 డిగ్రీలు కాగా కనిష్ఠంగా 6.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే బేల మండలంలో అత్యంత కనిష్ఠంగా 5.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా మావలలో 5.9, జైనథ్‌లో 6.4, ఆదిలాబాద్అర్బన్ 6.9, నేరడిగొండ 7.2, తాంసి 7.4, బజార్‌హత్నూర్ 8.0, గాదిగూడ 9.5డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 14డిగ్రీలలోపే కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమదయ్యాయి. గత వారం రోజులుగా తీవ్రమైన చలి ఉండడంతో జనం చలిమంటలు వేసుకుంటు వెచ్చదనం పొందుతున్నారు. చలితీవ్రతతో ఉదయం వేలల్లో పాఠశాలలకు వెళ్లేందుకు విద్యార్థులు తీవ్రఇబ్బందులకు గురవుతున్నారని పాఠశాలల సమయంలో మార్పులు చేయాలని కొందరు తల్లిదండ్రులు కలెక్టర్ రాజార్షిషా దృష్టికి తీసుకెళ్లారు. తప్పని సరిపరిస్థితుల్లో మాత్రం వెచ్చని దుస్తులను ధరించి బయటకు వస్తున్నారు.

చలికి మూగజీవాల విలవిల

ఇచ్చోడ: చలికి మూగజీవాలు విలవిల్లాడుతున్నాయి. ఉదయం 9 దాటినా చలి తగ్గడం లేదు. గత 5రోజులుగా పగటి పూట కూడా చలి విపరీతంగా పెడుతోంది. దీంతో చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బుధ, గురువారాల్లోనూ ఉష్ణోగ్రతలు తగ్గుతున్నట్లు వాతావరణశాఖ ప్రకటించడంతో స్వీయ రక్షణ చర్యలు తీసుకోవాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు.



ఉదయం 9గంటలు దాటినా చలి మంటలు కాగుతున్న జనం

ఆరోగ్యం



శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్న వైద్యులు



నయనం ప్రదానం!

- బడుగుల కళ్లల్లో కాంతి రేఖలు నింపుతున్న ముథోల్ భోస్లే గోపాల్ రావు పటేల్ కంటి దవాఖానా
- 42,819 మంది పేద రోగులకు ఉచిత శస్త్రచికిత్స
- 80 శాతం రోగులకు ఉచిత కనుగుడ్డు మార్పిడి

ముథోల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సర్వేంద్రియానం నయనం ప్రదానం. అన్నిఇంద్రియాల కన్నా కన్ను చాలావిలువైంది. ఎందరో పేదల కళ్లలో కాంతిరేఖలు నింపుతున్న ముథోల్ భోస్లే గోపాల్‌రావు కంటి దవాఖానా అందరి మన్ననలు పొందుతోంది. పేదవారికి ఉచిత పరీక్షలతోపాటు శస్త్రచికిత్సలు నిర్వహిస్తూ పేదప్రజలకు ఆపన్నహస్తంగా ముందుంటుంది. ఎల్వి ప్రసాద్ కంటివిజ్ఞానకేంద్రం హైదరాబాద్ నేతృత్వంలో డాక్టర్ జీఎస్‌రావు ఆధ్వర్యంలో ముథోల్‌లో 20 డిసెంబరు 1996న ప్రారంభమైన ముథోల్ భోస్లే గోపాల్‌రావు కంటి దవాఖానా వచ్చే 20న 28వ వసంతం లోకి అడుగిడుతోంది. ఈ ఆసుప్రతిఆలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న పేదలకు ఉచిత కంటిపరీక్షలతోపాటు ఉచిత శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నారు. వారికళ్లలో కాంతిరేఖలు నింపుతూ 1996 నుంచి డిసెంబరు 2024 వరకు సుమారు 7,41,824 మంది రోగులకు పరీక్షలు నిర్వహించారు. ఇందులో 9,0151 మందికి శస్త్రచికిత్సలు నిర్వహించగా ఇందులో సుమారు 42,819 వేల వరకు పేదరోగులకు ఉచిత శస్త్రచికిత్స నిర్వహించి వారికి కంటి చూపును అందించారు. ఈ ఆసుపత్రిలో 2003 నుంచి 7 ప్రాథమిక నేత్ర వైద్యకేంద్రాలను ఏర్పాటుచేశారు. ఈ కేంద్రంలో ప్రతిఒక్కరికీ ఉచిత పరీక్షలు నిర్వహిస్తున్నాయి. భైంసా, తానూర్, లోకేశ్వరం, కల్లూర్, కుభీర్, నిజామాబాద్ జిల్లాలోని నందిపేట్, నవీపేట్‌లలో ఏర్పాటుచేశారు. 1998లో సామూహిక నేత్ర పరిరక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రతీ పల్లెకు తిరిగి నేత్ర అవగాహన సదస్సును నిర్వహిస్తూ పేదలకు ఉచిత వైద్యసేవలను అందిస్తూ కంటివ్యాధులపై అవగాహన కల్పించారు. 2004లో నెలకు రూ.1కే సమగ్ర వైద్యనేత్రం కార్యక్రమాన్ని ప్రారంభించి నేటికీ సేవలను కొనసాగిస్తూ వస్తున్నారు.

● అంధులకు పునరావాస కార్యక్రమం

1998 జూలైలో అంధులకు పునరావాస కార్యక్రమాన్ని ప్రారంభించారు. కళ్లు కోల్పోయిన వారికి తమకాళ్లపై తాము నిలబడేలా శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటుచేసి వారికి తగిన రీతిలో శిక్షణ అవగాహన కల్పించారు. 1753 మందికి పునరావాసం కల్పించారు. పూర్తిగా అంధత్వం నిర్మూలించాలన్న దృఢసంకల్పంతో ముందుకు వెళ్తున్నట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి.

● 15 ఏళ్ల లోపు పిల్లలకు ఉచిత కంటి అద్దాలు

ఎల్వీ ప్రసాద్ కంటివిజ్ఞానకేంద్రం హైదరాబాద్ లా వెల్ల ఫండ్ ఆధ్వర్యంలో 15 ఏళ్ల లోపు 3,26,622 పిల్లలకు ఉచిత పరీక్షలు నిర్వహించి సుమారు 80వేల మంది పిల్లలకు ఉచితంగా కంటిఅద్దాలు అందజేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అవసరమగు వారికి శస్త్రచికిత్సలు నిర్వహించారు. 2011లో గ్లాకోమా, డయాబెటిక్ రెటి నోపతి అనే ప్రోగ్రాం ప్రారంభించి వీటి ద్వారా వ్యాధిగ్రస్తులకు అవగాహన కల్పించి రెటీనా సమస్యను గుర్తించి లేజర్‌చికిత్స నిర్వహించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రతీ సంవత్సరం గ్లాకోమా వ్యాధిగ్రస్తులకు అవగాహన కార్యక్రమాన్ని చేపడుతున్నారు.



అంధత్వం నిర్మూలనే లక్ష్యం

● సందీప్ రావు, ఆసుపత్రి పర్యవేక్షకులు

అంధత్వం నిర్మూలనే లక్ష్యంగా ఎల్వీ ప్రసాద్ కంటి విజ్ఞాన కేంద్రం పనిచేస్తోంది. కంటి జబ్బులను నిర్లక్ష్యం చేయకుండా దగ్గరలో ఉన్న కంటి ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేసుకోవాలి. శరీరంలో కళ్లు చాలా ప్రధానమైనవి. ఏ చిన్న సమస్య ఉన్నా డాక్టర్‌ను సంప్రదించాలి. ప్రతీ ఒక్కరికి తమ ఆసుపత్రి ఆధ్వర్యంలో అవగాహన నిర్వహిస్తున్నాం.



కంటి సమస్యపై నిర్లక్ష్యం వద్దు

● డాక్టర్ శ్రావ్య రెడ్డి, గ్లాకోమా కంటి శస్త్ర చికిత్స నిపుణులు

కన్ను ఎర్రబడడం, కంటి నుంచి నీరుకారడం, కంటికి దెబ్బతగలడంపై నిర్లక్ష్యం చేయొద్దు. దగ్గరలో ఉన్న కంటి ఆసుపత్రికి వెళ్లాలి. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే మా ఆసుపత్రి లక్ష్యం. ప్రతీ పల్లెలో కంటి జబ్బులపై అవగాహన కల్పిస్తున్నాం. అంధత్వ నిర్మూలనే ధైర్యంగా ముందుకెళ్తున్నాం.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

● కనుగుడ్డు మార్పిడి శస్త్ర చికిత్సలు

ఇక్కడి ప్రాంత పేద ప్రజలకు ఇబ్బందులు ఉండకూడదన్న ఉద్దేశంతో 2016లో కనుగుడ్డు మార్పిడీ చికిత్స ప్రారంభించారు. ఇప్పటివరకు ఇలాంటి సుమారు 100 మందికి శస్త్ర చికిత్స నిర్వహిస్తే ఇందులో 80శాతం ఉచిత చికిత్సలు నిర్వహించారు.

● నిర్మల్ జిల్లా ఇంటింటా సర్వే

నిర్మల్ డిస్ట్రిక్ట్ పాపులేషన్ స్క్రీనిటీ ప్రోగ్రాంలో భాగంగా సైట్ ఫర్ హోల్ ప్రోగాం సపోర్ట్ బై సీబీఎం ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జిల్లాలోని 726 గ్రామా ల్లో గల 7లక్షల ప్రజలకు ఇంటి వద్దకు వెళ్లి కంటి పరీక్షల గురించి సర్వే చేపడుతున్నారు. సర్వేలో భాగంగా జిల్లాలో ఇప్పటివరకు 4లక్షల 38వేల మంది ఇంటింటి సర్వేచేయగా 53వేల మందికి కంటి సమస్యలు ఉన్నాయని తెలిపారు. ఇందులో 2400 మందికి ఉచిత కంటి శస్త్రచికిత్సలు చేశారు. ఎ వరైతే నడవలేని వృద్ధులు, వికలాంగులు ఉంటే తమ సిబ్బందే సంబంధిత పరికరాలు తీసుకెళ్లి ఇంటి వద్దనే ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తారు.



గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

andhrajyothy.com
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 28.9 । కనిష్ఠం 11.4



నిర్మల్
జిల్లా వార్తలు
8
బుధవారం 18 డిసెంబరు 2024

కొండాపూర్ గ్రామ సమీపంలో ఉన్న సమీకృత వ్యవసాయ క్షేత్రం ఇదే



వ్యవసాయ క్షేత్రంలో కూరగాయలు సాగుచేస్తున్న దృశ్యం

సమీకృత సాగు

నిర్మల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా డీఆర్డీఓ ఆధ్వర్యంలో ప్రయోగాత్మకంగా సమీకృతసాగు కొనసాగుతోంది. డీఆర్డీఓ పీడీ విజయలక్ష్మి పూర్తి సేంద్రియ పద్ధతిలో మహిళ సంఘాల సహకారంతో చేపట్టిన ఈ ప్రయోగాత్మక సమీకృతసాగు సత్ఫలితాలనిస్తోంది. గత మూడు నాలుగు సంవత్సరాల క్రితం అప్పటి కలెక్టర్ వరుణ్ రెడ్డి సహకారం, సెర్ప్ తోడ్పాటుతో ఇక్కడి కొండాపూర్ వద్ద ఈ సమీకృత వ్యవసాయ క్షేత్రాన్ని ఏర్పాటు చేశారు. నిర్మల్ మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సమీకృత వ్యవసాయ క్షేత్రం జిల్లాలోనే మోడల్ వ్యవసాయ క్షేత్రంగా మారింది. 2023 సెప్టెంబరు నెలలో కొండాపూర్ గ్రామానికి చెందిన సత్తవ్వ అనే మహిళ వద్ద డీఆర్డీఓ అధికారులు ఒక ఎకరం పదిహేను గుంటల భూమిని లీజుకు తీసుకున్నారు. కాగా తక్కువ భూమిలో ఎక్కువ ఆరోగ్యకరమైన పంటలను సాగు చేయాలన్నదే ఈ సమీకృత వ్యవసాయక్షేత్రం ప్రధాన ఉద్దేశం. ఎలాంటి రసాయనిక ఎరువులు వాడకుండా కేవలం సేంద్రియ ఎరువులను ఉపయోగిస్తూ ఆకుకూరలు, కూరగాయల సాగుతో పాటు చిన్నచిన్న నీటి కుంటలను ఏర్పాటు చేసి అందులో చేపలు, కోళ్ల పెంపకం లాంటి వాటిని కూడా పొదుపు సంఘాల మహిళ రైతులతో నిర్వహిస్తున్నారు. ఈ సమీకృత వ్యవసాయ క్షేత్రం ద్వారా కూరగాయల సాగు అలాగే చేపలు, కోళ్ల పెంపకం లాంటి వాటితో మహిళా సంఘాల సభ్యులకు పెద్దమొత్తంలో ఆదాయం సమకూరుతోంది. మొత్తం ఈ సమీకృత సాగుక్షేత్రం కోసం 1.85లక్షలను వ్యయం చేయగా సాగు దిగుబడుగలతో వచ్చిన ఆదాయం 3.52లక్షలకు పైగా కావడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. అయితే ప్రయోగాత్మకంగా చేపట్టి సత్ఫలితాలు సాధించిన ఈ సమీకృత వ్యవసాయ క్షేత్రం చేస్తున్న కృషికి కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని ఉమెన్ ఎన్‌పవర్‌మెంట్ శాఖ ప్రతీయేటా మహిళ సంఘాల కృషి సేవలు అందించే రెవెల్యూషనరీ అవార్డుకు ఇక్కడి సమీకృత సాగు క్షేత్రం ఎంపికైంది.

	ఖర్చులు	అమ్మకం	లాభం
కూరగాయలు	12000	69,485	57,485
చేపలు	22,800	94,800	72,000
కోళ్ల	1,26,075	1,35,630	9555
వరి	24,420	52,900	28,480
	1,85,295	3,52,815	1,67,520



వ్యవసాయ క్షేత్రంలో ఉల్లి సాగు కోసం భూమిని చదును చేసి సిద్ధంగా ఉంచిన దృశ్యం

సాగు క్షేత్రానికి దక్కిన ప్రతిష్ఠాత్మక అవార్డు..

ఇదిలా ఉండగా ఇప్పటికి అనేక రకాల ఉపాధికి సంబంధించి ప్రయోగాలు చేపడుతూ సత్ఫలితాలు సాధిస్తున్న జిల్లా డీఆర్డీఓ పీడీ విజయలక్ష్మి ఆధ్వర్యంలో రూపొందిన సమీకృతసాగు క్షేత్రం జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకుంటోంది. ఈ మేరకు కేంద్రప్రభుత్వ పరిధిలోని ఎకనామిక్ ఎన్‌పవర్‌మెంట్‌తో బెస్ట్ ఉమేన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ కోసం జాతీయస్థాయిలో అందించే రెవెల్యూషనరీ అవార్డు ఈ సారి జిల్లాకు దక్కింది. ఈ అవార్డును స్వీకరించేందుకు నిర్మల్ డీఆర్డీఓ పీడీ విజయలక్ష్మి ఢిల్లీ వెళ్ళారు. జిల్లాకు సమీకృత సేంద్రియసాగు ప్రాజెక్టుకు సంబంధించి జాతీయస్థాయి అవార్డు దక్కడం ఇక్కడి మహిళ సంఘాలకు ప్రతిష్ఠాత్మకం కానుందని అంటున్నారు.



సమీకృత వ్యవసాయ క్షేత్రంలో చేపల పెంపకం కోసం ఏర్పాటు చేసిన చెరువులు ఇవే

- డీఆర్డీవో ఆధ్వర్యంలో మినీ వ్యవసాయ క్షేత్రం
- ప్రయోగాత్మకంగా సేంద్రియ పంటల సాగు
- చేపలు, కోళ్ల పెంపకం
- మహిళా సంఘాల సభ్యులకు పెద్ద ఎత్తున ఉపాధి
- జాతీయస్థాయిలో జిల్లా అవార్డుకు ఎంపిక

వ్యవసాయ క్షేత్ర సందర్శనకు మహిళ రైతుల క్యూ..

కాగా కొండాపూర్ వద్ద ఏర్పాటు చేసిన సమీకృత సాగుక్షేత్రాన్ని సందర్శించేందుకు జిల్లాలోని వ్యవసాయ ఆధారిత మండలాలకు చెందిన మహిళ రైతులు పెద్దసంఖ్యలో క్యూ కడుతున్నారు. ఇప్పటికే ఈ సమీకృత క్షేత్రాన్ని వ్యవసాయంలో ముందున్న దిలావర్‌పూర్ మండలం గుండంపెల్లి, సిర్గాపూర్ గ్రామాలకు చెందిన మహిళ రైతులతో పాటు పురుష రైతులు కూడా సందర్శించి అక్కడి సాగు పద్ధతులను, సేంద్రియ ఎరువుల వినియోగానికి సంబంధించిన మెళకువలను తెలుసుకున్నారు. వీరితో పాటు నిర్మల్ మండలంలోని మేడిపెల్లి, డ్యాంగాపూర్, కడెం గ్రామాలకు చెందిన పలువురు మహిళ సంఘాలకు చెందిన మహిళలు సందర్శించారు. ఇక్కడ సాగుపద్ధతులను అనుభవాలను తెలుసుకున్న మహిళ రైతులు తమ గ్రామాల్లో మినీ సమీకృత సాగుక్షేత్రాలను ఏర్పాటు చేసుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది.

ఒక్క ఐడియా జీవితాలనే మార్చేస్తోంది

రసాయనిక ఎరువుల వినియోగంతో భూసారం తగ్గిపోవడమే కాకుండా పంటలసాగుపై అనేక దుష్పరిణామాలు ప్రభావం చూపుతున్న నేపథ్యంలో డీఆర్డీఓ పీడీ విజయలక్ష్మి ప్రయోగాత్మకంగా చేపట్టిన సమీకృతసాగు విధానం మహిళ రైతులకు పెద్ద ఎత్తున ఉపాధి బాటలు వేస్తోంది. ఇప్పటి వరకు చాలా మంది పొదుపు సంఘాలకు చెందిన మహిళలు తమకు వ్యవసాయ భూములున్నప్పటికి సేంద్రియసాగు పద్ధతులు తెలియక వారు రైతు కూలీలుగానే కొనసాగుతున్నారు. అయితే కొండాపూర్ వద్ద ఏర్పాటు చేసిన సమీకృత సాగు క్షేత్రాన్ని సందర్శించి సాగు మెళకువలతో పాటు సేంద్రియ పద్ధతిలో పండించిన ఆకుకూరలు, కూరగాయల డిమాండ్‌ను వారంతా తెలుసుకొని అదే తరహాసాగుకు ఉపక్రమించారు. దీని కారణంగా జిల్లాలోని పలు గ్రామాల మహిళ రైతులు పండిస్తున్న సేంద్రియ పంటలకు ప్రస్తుతం మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడమే కాకుండా ధర కూడా ఎక్కువగానే లభిస్తోంది. తక్కువ వ్యయంతో సాగు చేస్తున్న ఈ పంటల ద్వారా లాభాలు సైతం రెట్టింపవుతున్నాయి.

మంచి లాభాలు వస్తున్నాయి



నిర్మల్ మండలం కొండాపూర్ గ్రామ సమీపంలో సమీకృత వ్యవసాయ క్షేత్రాన్ని ఏర్పాటు చేశాం. ఈ వ్యవసాయ క్షేత్రంలో కోళ్లు, చేపల పెంపకంతో పాటు ఆరోగ్యకరమైన ఆకు కూరలు, కూరగాయలు సాగుచేస్తున్నాం. మంచి లాభాలు వస్తున్నాయి.

నేరేళ్ల ఉమ, నిర్మల్ మండల సమాఖ్య అధ్యక్షురాలు

చిన్న, సన్నకారు రైతులకు ఎంతో మేలు



రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా మండలంలో ఈ వ్యవసాయ క్షేత్రాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ వ్యవసాయ క్షేత్రం ఆరోగ్యకరమైన పంటలను సాగు చేస్తున్నాం. ఈ పంటలను సాగుచేయడం వల్ల మండల సమాఖ్యకు ఎన్నో లాభాలు తెచ్చి పెట్టింది. అలాగే తక్కువ వ్యవసాయ భూమిలో ఆరోగ్యకరమైన పంటలను సాగు చేసేందుకు సమీకృత వ్యవసాయ క్షేత్రాలు ఎంతో అనుకూలంగా ఉంటాయి. ప్రస్తుతం ఈ వ్యవసాయ క్షేత్రంలో సాగు చేస్తున్న పంటలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

అడ్డిగ బోసు, ఏపీయం, నిర్మల్

బొప్పాయి తిని నలుగురు
విద్యార్థులకు అస్వస్థత

● చించోలి మైనార్టీ కళాశాలలో ఘటన



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

సారంగాపూర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : బొప్పాయి పండు తిని నలుగురు విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటన నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం చించోలి(బి) గ్రామంలోని ప్రభుత్వ మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాలలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. చించోలి(బి) గ్రామ ప్రభుత్వ మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాలలో 400మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అయితే సోమవారం సాయంత్రం పలువురు తల్లిదండ్రులు విద్యార్థులను కలిసేందుకు కళాశాలకు వచ్చారు. ఈ సందర్భంగా తమ తమ పిల్లలకు బొప్పాయి తీసుకొచ్చి ఇచ్చారు. అయితే రాత్రి వేళ బొప్పాయిని తిన్న నలుగురు విద్యార్థులు మంగళవారం ఉదయం వేళ వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. దీంతో అప్రమత్తమైన కళాశాల సిబ్బంది అస్వస్థతకు గురైన విద్యార్థులకు వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స చేయించారు. వారి వారి తల్లిదండ్రులకూ సమాచారం అందించారు. విద్యార్థుల తల్లిదండ్రులు హుటాహుటిన కళాశాలకు చేరుకొని అస్వస్థతకు గురైన నలుగురు విద్యార్థులను తమతో పాటు ఇంటికి తీసుకెళ్లారు. కాగా.. బొప్పాయి తినడం వల్లే విద్యార్థులు స్వల్ప అస్వస్థతకు గురయ్యారని వైద్య సిబ్బంది తెల్పారు. అదే సమయంలో కళాశాలలో అనారోగ్య సమస్యలు ఉన్నవారిని కూడా పరిశీలించి చికిత్స అందించారు.

'కుల సంఘాల భవనాల నిర్మాణానికి కృషి చేస్తా'

భైంసా, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రాధాన్యతననుసారం నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో కుల సంఘాల భవనాల నిర్మాణాలకు ప్రభుత్వం తరఫున పూర్తిస్థాయిలో తోడ్పాటునిస్తామని ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం దేగాం గ్రామంలోని తన క్యాంపు కార్యాలయంలో భైంసా పట్టణంలోని 10వ వార్డు పరిధిలో మేదరి సంఘ భవన నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు చేసిన ప్రొసిడింగ్ కాపీని కుల ప్రతినిధులకు అందేసిన సందర్భంగా మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని మేదరి కులస్తులు ప్రగతి బాటలో పయనించాలన్నారు. ఇందులో భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తోట రాము, మేదరి సంఘ ప్రతినిధులు గంగాధర్, శ్రీనివాస్, గోపాల్, గణేష్, వై.సాయినాథ్, జగదీష్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్లు చట్టాలను ఉపయోగించుకోవాలి

● జాతీయ పెన్షనర్ల దినోత్సవంలో కలెక్టర్ అభిలాష అభినవ్



మాట్లాడుతున్న కలెక్టర్



హాజరైన పెన్షనర్లు

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సీనియర్ సిటిజన్లు చట్టాలను ఉపయోగించుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మంగళవారం పెన్షనర్ల సంఘ భవనంలో జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సమాజాన్ని సన్మార్గంలో నడిపించడంలో పెన్షనర్లు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. యువత నేటికాలంలో పెడదారులు తొక్కకుండా ఉండాలంటే సీనియర్ సిటిజన్ల సలహాలు, సూచనలు ఉండాలన్నారు. ప్రపంచీకరణతో ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోయి ప్రేమ, అనురాగాలకు దూరమవుతున్నారన్నారు. ప్రభుత్వ సేవలందించి పదవీ విరమణ చేసిన పెన్షనర్లు పాఠశాలల్లో విద్యార్థులకు నైతిక విలువలు, అనుభవాలు బోధించి వారి అభ్యున్నతికి దోహదం చేయాలన్నారు. ప్రభుత్వ యంత్రాంగానికి తమ విలువైన సేవలను అందించాలని ఆకాంక్షించారు. పెన్షనర్ల సమస్యలు పరిష్కరించేందుకు తనవంతు సహకరిస్తానన్నారు. సీనియర్ సిటిజన్లు ఏవైనా సమస్యలుంటే తమకున్న చట్టాలు ఉపయోగించుకోవాలని, హక్కులు పరిరక్షించుకోవాలని సూచించారు. సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. జిల్లా న్యాయ సేవా అధికారిక సంస్థ కార్యదర్శి జి.రాధిక మాట్లాడుతూ.... ప్రతి రిటైర్డ్ ఉద్యోగి పెన్షన్ తీసుకోవడం రాజ్యాంగం కల్పించిన హక్కు అన్నారు. సమాజంలో వయోవృద్ధులకు ఎదురవుతున్న సమస్యలు పరిష్కరించేందుకు న్యాయసేవా సంస్థ చర్యలు తీసుకుంటుందన్నారు. యువతకు పెన్షనర్లు మార్గదర్శనం చేయాలని కోరారు. పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు ఎంసీ లింగన్న మాట్లాడుతూ... సంఘ భవన ప్రహరీకి కలెక్టర్ 5 లక్షలు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పెన్షనర్ల సంఘ సామాజిక కార్యక్రమాలు వివరించారు. జిల్లా ట్రెజరీ అధికారి సరోజ మాట్లాడుతూ... పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి సహకరిస్తానన్నారు. ఆర్డీవో రత్న కళ్యాణి, ఓఎస్డీ రమేష్, ఎమ్మార్వో రాజు, సంఘ ప్రతినిధులు, పెన్షనర్లు పాల్గొన్నారు. అనంతరం పారిశుద్ధ్య, సామాజిక, సేవా రంగాల్లో సేవలందించిన పలువురిని శాలువాతో సన్మానించారు.

డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సమగ్ర నివేదికలు సమర్పించాలి

జిల్లాలో చేపట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణ సమగ్ర నివేదికలు సమర్పించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ... మంజూరైనవి, పరిపాలన అనుమతులు పొందినవి, పూర్తయిన, నిర్మాణంలో ఉన్న వాటి వివరాలు తెలియజేయాలన్నారు. ఇప్పటి వరకు లబ్ధిదారులకు ఇచ్చిన వాటిలో విద్యుత్, తాగునీరు, తదితర సౌకర్యాలు కల్పించాలని సూచించారు. మండలాల వారీగా ఇళ్ల నిర్మాణాల పురోగతిపై చర్చించారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీవో రత్న కళ్యాణి, పంచాయతీ రాజ్ ఈఈ శంకరయ్య, ట్రైబల్ వెల్ఫేర్, ఇంజనీరింగ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రణాళికబద్ధంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలి

● జిల్లా విద్యా శాఖ అధికారి రామారావు ● కేజీబీవీ ఆకస్మిక తనిఖీ



కేజీబీవీలో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

దిలావర్‌పూర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రణాళికబద్ధంగా చదివి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా వైద్యాధికారి రామారావు కేజీబీవీ విద్యార్థులకు ఉద్బోధించారు. మంగళవారం దిలావర్‌పూర్ మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల హాజరు వివరాలను పరిశీలించారు. అయితే డీఈవో వచ్చినప్పుడు ఇద్దరు సీఆర్టీలు, ఇద్దరు పీజీ సీఆర్టీలు, పీఈటీ, ఏఎన్ఎం హాజరు కాగా నాన్ టీచింగ్ సిబ్బంది మాత్రం అందరూ హాజరయ్యారని డీఈవో గుర్తించారు. అనంతరం తరగతుల నిర్వహణ, కిచెన్ నిర్వహణ, భోజనం తయారీ తదితర వాటిని తనిఖీ చేశారు. పదో తరగతి గదికి వెళ్లి విద్యార్థులకు పరీక్షలపై మార్గ నిర్దేశం చేశారు. సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల, భోజన ఏర్పాట్ల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలో కామన్ డైట్ మెనూ అమలుపై ఆరా తీశారు. డీఈవో వెంట జిల్లా కేజీబీవీ సమన్వయకర్త సలోమి కరుణ ఉన్నారు.



నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

ఎస్ఎస్ఏ ఉద్యోగులకు
ఎంఈవోల మద్దతు

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న ఆందోళనకు మంగళవారం జిల్లాలోని మండల విద్యాధికారులు మద్దతు ప్రకటించారు. 8వ రోజున ఆడపడుచులు బతుకమ్మ ఆడుతూ నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించకుంటే బోధనేతర సిబ్బంది పాల్గొని ఆందోళన ఉధృతం చేస్తామని న్యాయమైన డిమాండ్లు నెరవేర్చుకుంటా మన్నారు. ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయడంతో పాటు రెగ్యులరైజేషన్, 30 శాతం వెయిటేజ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ స్టేట్ ప్రెసిడెంట్ కృష్ణారావు, ఎస్ఎస్ఏ అధ్యక్షుడు బి. గంగాధర్, రాజారత్నం, నరేష్, రజిత, సంధ్య, వనిత, ఫర్హాత్ బేగం, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్ షర్మిల
జన్మదిన వేడుకలు



వైఎస్ షర్మిల జన్మదిన వేడుక నిర్వహిస్తున్న దృశ్యం

ముథోల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోరిగాం గ్రామ వ్యవసాయ క్షేత్రంలో రైతుల మధ్య ఏపీ సీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల జన్మదిన వేడుకలను ఆమె అభిమాని ఎస్‌కే నజీమ్ హైమద్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌కే నజీమ్ మాట్లాడుతూ... ప్రతిఏటా వైఎస్ షర్మిల జన్మదిన వేడుకలను వ్యవసాయ క్షేత్రంలో రైతులతో కలిసి ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశంతో
రహదారి మరమ్మతులు

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కలెక్టర్ ఆదేశం మేరకు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి రహదారి మరమ్మతు పనులు చేపడుతున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. 3 వారాల పాటు ప్రస్తుత దారి మూసి వేస్తామని ప్రత్యామ్నాయంగా ధర్మసాగర్ సంక్షేమ పాఠశాల, ప్రియదర్శిని నగర్, చాణక్య స్కూల్ మీదుగా వెళ్లాలని ప్రజలకు సూచించారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్‌టౌన్ 1, 2, 3 సబ్‌స్టేషన్‌లతో పాటు సోన్ పరిధిలో బుధవారం విద్యుత్ సమస్య పరిష్కార వేదిక ఉదయం 10:30 గంటలకు సోన్ సబ్‌స్టేషన్‌లో నిర్వహిస్తున్నట్లు నిజామాబాద్ చైర్మన్ ఈ. నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు హాజరై సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు.

సర్వే పారదర్శకంగా చేపట్టాలి

ముథోల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల సర్వే పారదర్శకంగా చేపట్టాలని ఎంపీడీవో శివ కుమార్ అన్నారు. మండల కేంద్రమైన ముథోల్‌తో పాటు మండలంలోని తరోడా గ్రామంలో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు.

మాక్స్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి
ఆర్థిక సహాయం అందజేత

సారంగాపూర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కౌట్ల(బి)లో ఇటీవలే అనారోగ్యంతో మృతిచెందిన సాదు మహేందర్ రెడ్డి కుటుంబ సభ్యులకు మంగళవారం మాక్స్ ఆధ్వర్యంలో మాక్స్ అధ్యక్షులు నాకిరెడ్డి నర్సారెడ్డి, మాక్స్ సభ్యులు రూ. లక్ష ఆర్థిక సహాయం కింద అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాక్స్‌లో సభ్యులుగా ఉన్న కుటుంబ సభ్యులు అనారోగ్యంతో మృతి చెందితే బాధిత కుటుంబాలకు రూ. లక్షను ఆర్థిక సహాయం కింద అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాక్స్ ఉపాధ్యక్షులు ఐరా భోజారెడ్డి, కోశాధికారి లక్ష్మారెడ్డి, సభ్యులు పోతారెడ్డి, గోవింద్‌రెడ్డి, రామ్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, సత్యపాల్‌రెడ్డిలు ఉన్నారు.